

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి తదితరులు


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, మంగళవారం 4 జూన్ 2024 HYDERABAD




చల్లని సాయంత్రాన హుస్సేన్‌సాగర్‌లో బోటులో షికారు చేస్తున్న నగరవాసులు

## ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి

ప్రజలు తిరగబడే రోజులు వస్తున్నాయ్

అమర వీరులంటే ముఖ్యమంత్రికి గౌరవం లేదు

ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

కేసీఆర్ కీర్తిని చెరిపేయలేరు : ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, జూన్ 3 : కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని, రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు చర్చించుకుంటున్నారని కవి గాయకుడు , ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహేశ్వరం నియోజకవర్గం, మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ చందన చెరువు కట్టపై ఏర్పాటు చేసిన అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆనాడు తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, గ్రంథాలయ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్, గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ రజినీ సాయిచంద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పురుషోత్తం రావు, బిరుదు చందర్, రాం నర్సింహ గౌడ్ తోపాటు ఉద్యమంలో పనిచేసిన వారిని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్ర పటానికి, అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశపతి, గిద్దె రామనర్సయ్య, చందర్ పాటలతో ధూంధాం చేశారు. ఈ సమావేశానికి మంత్రి రవీందర్ రావు అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించి చిహ్నాలు మార్చడమే పనిగా పెట్టుకున్న రేవంత్ రెడ్డి సర్కార్‌పై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కేసీఆర్‌పై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2500 ఇవ్వకుంటే.. మహంకాళీలై నీ కుర్చీని కూలదోస్తారన్నారు. పేద ప్రజల ఇండ్ల క్రమబద్ధీకరణకు ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్ తీసుకొస్తే తప్పు పట్టిన రేంత్ రెడ్డి ఇప్పుడు మాత్రం ఆస్కీమ్‌ను అమలు చేస్తామని చెబుతున్నారని అన్నారు. అభివృద్ధి ఎలా చేయాలో తెలియక తికమక పడుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కరంటు సమస్య, నీటి సమస్య లేకుండా ఉత్పత్తిని పెంచారని తెలిపారు. ఉన్నదాన్ని చక్కదిద్దడం చేత కాక తప్పుడు ఆరోపణలకు తెర లేపుతున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కొలువులు ఇస్తామన్న రేవంత్ రెడ్డి ఒక్క దివ్యాంగురాలికి మాత్రమే బహిరంగ సభ పెట్టి ఇచ్చారన్నారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రం కోసం బలిదానం చేసుకున్న అమరుల కుటుంబాలకు ఉద్యోగాలు, ఇంటి స్థలాలిచ్చామని చెప్పారు. త్వరలోనే కోదండరామ్ ఇంటి ముందు కొలువుల కొట్లాట మొదలవుతుందన్నారు. అమర వీరుల దినోత్సవం ముందు జరిపితే పాకిస్థాన్‌కు స్వాతంత్ర్య దినోత్సవం లాగా చేస్తారా? అని ముఖ్యమంత్రి అనడం సిగ్గుచేటు అన్నారు. కాకతీయుల పేరు, చార్మినార్ గుర్తు ఉండకూడదని చెప్పడం చరిత్రను వక్రీకరించినట్లు అవుతుందన్నారు. అమర వీరులకు రేవంత్ రెడ్డి ఏనాడు నివాళులర్పించలేదని.. ముఖ్యమంత్రి అయిన తర్వాత మాత్రం నివాళులర్పిస్తున్నాడని ఎద్దేవా చేశారు.

### కేసీఆర్ కీర్తిని చెరిపేయలేరు: ఎమ్మెల్యే



కేసీఆర్ కీర్తిని ఎవరూ చెరిపేయలేరని.. అది సాధ్యం కాదని ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఉద్యమకారుల కష్టాలు తనకు తెలుసన్నారు. నియోజకవర్గంలో ఏ చిన్న పోస్టు వచ్చినా ఉద్యమకారులకు ఇచ్చామన్నారు. కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సమయంలో హోంమంత్రిగా తాను వెళ్లడం జరిగిందన్నారు. సాయి చందు మర్చిపోలేని వ్యక్తి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్‌తో ఎంతో అనుబంధం ఉందన్నారు. తెలంగాణ అమరులకు గుర్తుగా బడంగ్‌పేట గ్రౌండ్‌కు సిరిపురం యాదయ్య పేరు పెట్టుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహన్, డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి, మాజీ ఎంపీపీ లావణ్య బీరప్ప, మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, మీర్‌పేట బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కామేష్ రెడ్డి, బడంగ్‌పేట బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి, కందుకూరు అధ్యక్షుడు యుగేందర్ ముదిరాజ్, శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్లు బీరప్ప, అనిల్ కుమార్ యాదవ్, భూపాల్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమ నాయకులు ఉన్నారు.

## ట్రై కమిషనరేట్ల పరిధిలో నేడు మద్యం బంద్

అమలులో 144సెక్షన్

సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ): ఓట్ల లెక్కింపు నేపథ్యంలో నేడు ఉదయం 6 నుంచి 5వ తేదీ ఉదయం 6 గంటల వరకు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ల పరిధిలో మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు, కల్లు కంపౌండ్లు మూసివేస్తూ ట్రై కమిషనరేట్లకు చెందిన కమిషనర్లు ఆదేశాలు జారీ చేశారు. అంతే కాకుండా ఓట్ల లెక్కింపు సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడకుండా ఉండేందుకు ముందుజాగ్రత్త చర్యగా మూడు కమిషనరేట్ల పరిధిలో నేడు ఉదయం 6 గంటల నుంచి రేపు ఉదయం 6గంటల వరకు 144 సెక్షన్ విధిస్తున్నట్లు పోలీసు కమిషనర్లు వెల్లడించారు. ఆంక్షల నేపథ్యంలో మూడు కమిషనరేట్ల పరిధిలో ఎలాంటి ర్యాలీలు, ధర్నాలు, బహిరంగ సభలు, సమావేశాలు నిషేధమని, ఐదు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడరాదని ఆదేశాల్లో పేర్కొన్నారు. మద్యం విక్రయాలపై నిషేధం ఉన్న సమయంలో ఎవరైన నిబంధనలకు విరుద్ధంగా మద్యం సరఫరా చేసినా, బెల్టుషాపులు, ఇతర మార్గాల్లో మద్యం విక్రయాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు కమిషనర్లు హెచ్చరించారు.

## గాంధీ వైద్యుడిపై విచారణ పూర్తి

డీఎంఈకి నివేదిక

సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ): సర్జరీ చేసేందుకు లంచం డిమాండ్ చేసిన గాంధీ దవాఖాన వైద్యుడిపై విచారణ పూర్తయింది. దర్యాప్తు నివేదికను దవాఖాన సూపరింటెండెంట్ డా.రాజారావు సీల్డ్ కవర్‌లో డీఎంఈకి సమర్పించారు. గాంధీ దవాఖానలో శస్త్రచికిత్స చేసేందుకు ఓ వైద్యుడు రోగి వద్ద డబ్బులు డిమాండ్ చేసినట్లు ఇటీవల దవాఖాన సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు అందిన విషయం తెలిసిందే. దీనిని సీరియస్‌గా తీసుకున్న గాంధీ సూపరింటెండెంట్ ఇచ్చిన ఫిర్యాదుపై నాలుగు విభాగాధిపతులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, విచారణకు ఆదేశించారు. ప్రత్యేక కమిటీ విచారణ జరిపి సూపరింటెండెంట్‌కు నివేదికను సమర్పించింది. ఈ మేరకు నివేదికను గాంధీ సూపరింటెండెంట్ డా.రాజారావు డీఎంఈకి సీల్డ్ కవర్‌లో సమర్పించారు. నివేదిక ఆధారంగా ఒకటి రెండు రోజుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైద్యుడిపై డీఎంఈ చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.



బోడుప్పల్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన కాలనీవాసులు

# కరెంట్ కోతలపై కన్నెర్ర

బోడుప్పల్ సబ్ స్టేషన్‌ను ముట్టడించిన కాలనీవాసులు

ఎక్కువ చోట్ల విద్యుత్ తీగలపై పడిన చెట్లు, కొమ్మలు

గంటల తరబడి కొనసాగిన పునరుద్ధరణ పనులు

బోడుప్పల్, జూన్ 3: ఒక వైపు ట్యాంక్‌బండ్ వేదికగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అదే సమయంలో కరెంటు కోతలతో బోడుప్పల్ పరిసర పరిసర ప్రాంతాల ప్రజలు కరెంటు కోతలతో సతమతమయ్యారు. సాయంత్రం 4 గంటల తర్వాత కురిసిన వర్షంతో పలు చోట్ల చెట్లు, వాటి కొమ్మలు విరిగి విద్యుత్ తీగలు, స్తంభాలపై పడటంతో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గంటలు గడుస్తున్నా విద్యుత్ రాకపోవడంతో కాలనీ వాసులంతా ఆగ్రహంతో బోడుప్పల్ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ముట్టడించారు. ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఆగ్రహం చెందిన ద్వారకానగర్, శ్రీసాయి నగర్ కాలనీ, బయ్యన్నగూడ, శ్రీనివాసనగర్, బాలాజీ నగర్, ఆనంద్‌నగర్ కాలనీ, ఓల్డ్ విలేజ్, యాదవ్ బస్తీ, జ్యోతినగర్ కాలనీ వాసులు సబ్ స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలో నివాసం ఉండే వందలాది మంది కాలేజీ విద్యార్థులు కాలనీవాసులకు మద్దతుగా నిలిచారు. గత ప్రభుత్వ హయాంలో లేని విద్యుత్ కోతలు ఇప్పుడెందుకు వస్తున్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్‌గౌడ్, తిరుపతి యాదవ్ నిరసనలో పాల్గొన్నారు. ఆరు నెలలుగా విద్యుత్ సరఫరాలో జరుగుతున్న లోపాలపై అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని లక్ష్మీగణపతి కాలనీ అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి ఆరోపించారు. వర్షాలు వచ్చినప్పుడల్లా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు మహమ్మద్ అలీ, ప్రవీణ్ పేర్కొన్నారు. ఇదే విషయమై విద్యుత్ శాఖ అధికారులు సాయంత్రం 5.20 రాత్రి 10.25 వరకు బోడుప్పల్ పరిధిలోని తలెత్తిన విద్యుత్ అంతరాలను సరిదిద్దామని, పునరుద్ధరణ పనుల్లో జాప్యం కావడానికి చాలా కారణాలు ఉన్నాయని ట్విట్టర్ వేదికగా వివరించారు. ఒకేసారి 5 ప్రాంతాల్లో వర్షానికి చెట్లు, వాటి కొమ్మలు పడిపోవడం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అన్ని చోట్ల చెట్లను తొలగించి, విద్యుత్ లైన్లను, స్తంభాలను సరిచేసేందుకు సమయం పట్టిందని, కొన్ని ఫీడర్ల నుంచి వచ్చే లైన్లలో విద్యుత్ సరఫరా జరగలేదని అధికారులు వివరణ ఇచ్చారు.

### సమస్య రాకుండా చూసుకుంటాం : స్వామి, ఏఈ, బోడుప్పల్

అకాల వర్షం, ఈదురు గాలులతో సమస్య జఠిలమైంది. పిడుగుపాటుతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. సబ్ స్టేషన్‌లో నలుగురు సిబ్బందిని అందుబాటులో ఉంచాం. మరోసారి జరగకుండా చూసుకుంటాం.

### లక్ష రూపాయలు నష్టపోయాం..



గత ఆరు నెలలుగా విద్యుత్ సరఫరాలో విపరీతమైన అంతరాయం ఏర్పడుతుంది. వయసు పైబడినందున ఇంటికి లిఫ్ట్ ఏర్పాటు చేసుకున్నాం. కరెంట్ హెచ్చుతగ్గులతో మదర్ బోర్డుతో పాటు ఇంట్లో ఉన్న విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. సుమారు రూ.లక్ష వరకు ఖర్చయ్యింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల రోజే 6గంటల వ్యవధిలో సుమారు 19సార్లు కరెంట్ కట్ అయ్యింది. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

**- నర్రరాంలింగారెడ్డి, ఈస్ట్ బాలాజీ హిల్స్ కాలనీ, బోడుప్పల్ (1969 తెలంగాణ తొలిదశ ఉద్యమకారుడు)**

### విద్యుత్ కోతలు తట్టుకోలేకపోతున్నాం



రోజంతా పనిచేసి ఇంటికి రాగానే కరెంట్ కోతలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాం. వేసవికాలమంతా విద్యుత్ కోతలతో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఇలానే కొనసాగితే ప్రభుత్వంపై త్వరలో వ్యతిరేకత ఏర్పడుతుంది. ఉచిత విద్యుత్ సాకుతో ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించక ఇబ్బందులకు గురిచేస్తున్నది. వివిధ కారణాలతో రోజుకు 12గంటల కరెంట్ కూడా అందివ్వడం లేదు.

**- బిల్లా సోమిరెడ్డి, ప్రైవేట్ ఉద్యోగి, బోడుప్పల్**



తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏఎస్‌రావునగర్ డివిజన్ టీఎస్ఐఐసీ కాలనీలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, హెచ్‌బీకాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు కాసం మహిపాల్ రెడ్డి, కుమార స్వామి, మణెమ్మ తదితరులు

## గ్రేటర్‌కు వర్ష సూచన

సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో గ్రేటర్‌కు ఎల్లో అలర్ట్ హెచ్చరికలు జారీ చేశారు. కాగా సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 32.6 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 23.6 డిగ్రీలు, గాలిలో తేమ 59 శాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

## ఏస్కీలో ఆర్బిట్రేషన్ కోర్సు

సిటీబ్యూరో, జూన్ 3(నమస్తే తెలంగాణ): గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియాలో ఆర్బిట్రేషన్ అంశంపై ప్రత్యేక కోర్సును అందుబాటులోకి తీసుకువచ్చినట్లు డైరెక్టర్ రామేశ్వర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్క విద్యార్థి ఈ కోర్సుకు అర్హులేనని తెలిపారు. ఏడాదిపాటు ఉండే ఈ కోర్సును పూర్తి చేయడంలో ఆర్బిట్రేటర్ కన్సల్టెన్సీని సొంతంగా నిర్వహించుకునే అవకాశం ఉందన్నారు. పూర్తి వివరాలకు ఏస్కీ సెంటర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.



ర్యాండమైజేషన్ ద్వారా ఎన్నికల అధికారులకు విధులు కేటాయిస్తున్న ఎన్నికల పరిశీలకురాలు ప్రియాంక శుక్లా, మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

## రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి

నేడు ఉదయం 5.30 గంటలకు మూడో విడతతో సిబ్బందికి టేబుల్స్ కేటాయింపు

సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ ): పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా సోమవారం కౌంటింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్ నేతృత్వంలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ హాల్‌లో ఎన్నికల సంఘం నిబంధనలు అనుసరిస్తూ కౌంటింగ్ సిబ్బంది సెకండ్ ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల కమిషన్ నియమించిన అబ్జర్వర్ల సమక్షంలో నిర్వహించారు. జిల్లాలో హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో పోలైన ఓట్లతో పాటు పోస్టల్ బ్యాలెట్ ఓట్లను మంగళవారం లెక్కించనున్నారు. ఈ మేరకు కౌంటింగ్ సిబ్బంది సెకండ్ ర్యాండమైజేషన్ ద్వారా ఆయా అసెంబ్లీ సెగ్మెంట్లకు కేటాయించారు. పారదర్శకంగా ఈ ప్రక్రియ మొత్తాన్ని అబ్జర్వర్ల సమక్షంలో ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. మంగళవారం ఎర్లీ మార్నింగ్ మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పరిశీలకులు నిర్వహిస్తారు. ఈ ప్రక్రియతో కౌంటింగ్ సిబ్బందిని టేబుల్‌కు కేటాయిస్తారని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి, సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, సీఈఓ మధుకర్ నాయక్ పాల్గొన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సందర్భంగా కౌంటింగ్ సిబ్బందికి సంబంధించి రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను సాధారణ ఎన్నికల పరిశీలకురాలు ప్రియాంక శుక్లా, జిల్లా కలెక్టర్ గౌతమ్ పూర్తి చేశారు. కౌంటింగ్ సూపర్‌వైజర్స్, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లను కేటాయించారు.

| నియోజకవర్గం | ఎన్నికల పరిశీలకులు |
|---|---|
| సికింద్రాబాద్ | డాక్టర్ సరోజ్‌కుమార్ |
| సికింద్రాబాద్ కంటోన్మెంట్ | వైకే జోషి |
| నాంపల్లి | మాందార్ శ్రీకాంత్ వైద్య |
| చార్మినార్ | శ్రీమతి పిఐ శ్రీవిద్య |
| అంబర్‌పేట్ | జితేశ్ శ్రీ మాల్వియా |
| ముషీరాబాద్ | కీర్తి ప్రకాశ్ భారతి |
| మలక్‌పేట | నిమల్ చంద్ హల్దార్ |
| యాకత్‌పుర | ఆదిల్ ఖాన్ |
| బహదూర్‌పుర | భూపేందర్ కుమార్ |
| కార్వాన్ | తుషార్ కాంతి బిస్వాస్ |
| చాంద్రాయణగుట్ట | రాంజీ లాల్ |
| సనత్‌నగర్ | శివకుమార్ గుప్తా |
| గోషామహల్ | జగదీప్‌దాండ |
| ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ | ఎంజే రూపా |



కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్

# కొన్ని గంటల్లో ఓటరు తీర్పు

21 రోజుల తర్వాత తేలుతున్న అభ్యర్థుల భవితవ్యం.. నాలుగు ఎంపీ, ఓ అసెంబ్లీ నియోజకవర్గంలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు

### ఆరువేల మందితో 9,859 పోలింగ్ కేంద్రాలు.. 546 టేబుళ్లపై ఓట్ల లెక్కింపు

ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభం

మధ్యాహ్నం 3 గంటల్లోగా పూర్తి ఫలితం వెల్లడి

సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ ) : మరికొద్ది గంటల్లో ఉత్కంఠకు తెరపడనుంది. దాదాపు 21 రోజుల పాటు సుదీర్ఘ నిరీక్షణ వీడనుంది. రాజధాని పరిధిలోని నాలుగు ఎంపీ స్థానాలు, ఓ అసెంబ్లీ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. మొదటి అరగంటలో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఉండగా..తొమ్మిది గంటల నుంచి అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓట్ల లెక్కింపు ప్రారంభమై మధ్యాహ్నం 3 గంటలకల్లా పూర్తి ఫలితం వెల్లడి కానుంది. మొదట ఉదయం 5.30 గంటలకు ఎన్నికల పరిశీలకుల ఆధ్వర్యంలో ఉద్యోగులకు విధుల కేటాయింపు ఉంటుంది. సుమారు ఆరువేల మంది ఉద్యోగులు ఓట్ల లెక్కింపులో పాల్గొంటున్నారు. మొత్తం నాలుగు ఎంపీలు, కంటోన్మెంట్ అసెంబ్లీకి సంబంధించి 9,859 పోలింగ్ కేంద్రాల ఓట్లను 546 టేబుళ్లపై లెక్కించనున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు మూడు అసెంబ్లీ సెగ్మెంట్ల కేంద్రాల్లో సఫరేట్ హాలులో జరుగుతుందని ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్ చెప్పారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని కమలానెహ్రూ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన చార్మినార్ అసెంబ్లీ సెగ్మెంట్ ఓట్ల లెక్కింపు కేంద్రంలో, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఉస్మానియా యూనివర్సిటీ సెంటర్ ప్రొ.రాంరెడ్డి ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో ఏర్పాటు చేసిన సికింద్రాబాద్ అసెంబ్లీ ఓట్ల లెక్కింపు కేంద్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికకు సంబంధించి సీఎస్ఐఐటీ, వెస్లీ కాలేజ్‌లో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రంలో జరుగుతుందని వివరించారు.

### ఓట్ల లెక్కింపు ఇలా...

| పార్లమెంట్ స్థానం | పోలింగ్ కేంద్రాలు | టేబుళ్లు |
|---|---|---|
| హైదరాబాద్ | 1944 | 105 |
| సికింద్రాబాద్ | 1810 | 104 |
| మల్కాజిగిరి | 3228 | 158 |
| చేవెళ్ల | 2877 | 165 |
| కంటోన్మెంట్ (అసెంబ్లీ) | 232 | 14 |

### కౌంటింగ్‌కు సర్వం సిద్ధం..

మేడ్చల్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం చేశారు. మల్కాజిగిరి లోక్ సభ ఓట్ల లెక్కింపును మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ ఐదు నియోజకవర్గాలకు సంబంధించి మేడ్చల్ జిల్లా కీసర మండలం భోగారం హోలీమేరీ కళశాల, ఎల్బీనగర్ నియోజకవర్గానికి సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, కంటోన్మెంట్ నియోజవర్గానికి సికింద్రాబాద్‌లోని వెస్లీ కళాశాలలో మంగళవారం కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఓట్ల లెక్కింపునకు అధికారులు 178 టేబుళ్లను ఏర్పాటు చేశారు. 575 మంది సిబ్బంది ఓట్ల లెక్కింపులో విధులు నిర్వహించనున్నారు.

### కంటోన్మెంట్‌లో గెలిచేదెవరు ?

కంటోన్మెంట్, జూన్ 3: పోటాపోటీగా జరిగిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికల ఫలితాలు మంగళవారం విడుదల కానున్నాయి. కంటోన్మెంట్‌తో పాటు మల్కాజిగిరి పార్లమెంట్‌కు సంబంధించిన ఓట్ల లెక్కింపునకు వెస్లీ కళాశాలలోని రెండు హాళ్లలో అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎన్నికల లెక్కింపు చేపట్టనున్న నేపథ్యంలో అవసరమైన సిబ్బంది, భద్రతా ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలు కల్పించినట్లు రిటర్నింగ్ అధికారి మధుకర్ నాయక్ వెల్లడించారు. నియోజకవర్గం పరిధిలో మొత్తం 2,53,706 మంది ఓటర్లు ఉండగా 1,30,929 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 232 పోలింగ్ కేంద్రాలతో పాటు మూడు అదనపు పోలింగ్ స్టేషన్‌లతో కలిపి మొత్తం 235 ఈవీఎంలలో ఓట్లు నిక్షిప్తమై ఉన్నాయి. ఒక్కో రౌండ్‌లో 14 ఈవీఎంలకు సంబంధించిన ఓట్లను లెక్కిస్తారు. ఈ మేరకు 17 రౌండ్‌లకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తవుతుంది. కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లను సోమవారం నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.